

30న కాకినాడలో వికాస జాబ్ మేళా

ప్రజాశక్తి-కాకినాడ

వికాస ఆధ్వర్యంలో జనవరి 30న కాకినాడ కలెక్టరేట్ ప్రాంగణంలోని వికాస కార్యాలయం వద్ద జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పీడీ కెఎల్.రావు ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో విప్రోలో నాన్ వాయిస్ ప్రాసెస్, బజాజ్ కాపిటల్‌లో మార్కెటింగ్ ఆఫీసర్స్, ఫైనాన్షియల్ అడ్వైజర్స్, టెలికాలర్స్, ఎస్ఎల్‌వి.ఇంజనీర్స్, ఆర్కిటిక్స్ అండ్ కన్స్ట్రక్షన్స్ సంస్థలో జూనియర్ ఇంజనీర్ ఎన్ఐటి, ఐసిఐసిఐలో రిలేషన్‌షిప్ మేనేజర్, సీనియర్ ఆఫీసర్, డెక్కన్ కెమికల్స్ సంస్థలో ట్రైనీ (ప్రొడక్షన్), హ్యుండాయ్ మోబీస్‌లో టెక్నీషియన్, హీల్ మై ఫ్యామిలీ హెల్త్ కేర్ సర్వీసెస్‌లో కేర్ టేకర్స్, హెల్ప్ యువర్ నీడ్స్‌లో ఆసక్తి గల అభ్యర్థులు వికాస కార్యాలయం వద్ద ఉదయం 9.30 గంటలకు సర్టిఫికెట్స్ జెరాక్స్‌తో హాజరవ్వాలన్నారు. వివరాలకు 8297400666 నెంబరులో సంప్రదించాలన్నారు.

రెగ్యులర్ అధ్యాపకులేరీ..?

- రెగ్యులర్ అధ్యాపకుల కొరత
- మూడొంతులు కాంట్రాక్టు అధ్యాపకులు
- ఈ నెలఖరుతో ఒప్పందం ముగింపు



ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఇంటర్ విద్యపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. అనేకేళ్లుగా రెగ్యులర్ అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయకుండా గెస్ట్, కాంట్రాక్ట్ అధ్యాపకులతో కాలం నెట్టుకొస్తోంది. తమను రెగ్యులర్ చేయాలని కొన్నేళ్లుగా వీరు డిమాండ్ చేస్తున్నా సర్కారు పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో ఈ నెలాఖరుతో ఒప్పంద అధ్యాపకుల కాల పరిమితి ముగియనుంది. దీంతో ప్రభుత్వ ఇంటర్ విద్యార్థుల పరిస్థితి మరింత అగమ్యగోచరంగా మారనుంది. పూర్తిస్థాయిలో అధ్యాపకులు లేక, అరకొర పాఠ్యపుస్తకాలతో ఇప్పటికే కాలం వెళ్లదీస్తున్న విద్యార్థులు మరింత ఆందోళన చెందుతున్నారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 44 ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలలు ఉన్నాయి. సుమారు 1.50 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో 120 మంది రెగ్యులర్ అధ్యాపకులు, 342 మంది కాంట్రాక్టు, 60 మంది గెస్ట్ అధ్యాపకులు పని చేస్తున్నారు. వీరిలో మూడొంతులు కాంట్రాక్టు సిబ్బందే విధులు నిర్వహిస్తున్నారు. 10 నెలల కాల పరిమితి ఈ నెలా ఖరుతో ముగుస్తున్న ఒదున సమస్యలను ఏర్పడనున్నాయి. 2015 పిఆర్‌సి సిఫార్సుల ప్రకారం 2021 విద్యా సంవత్సరం నుంచి నెలకు రూ. 57,100 వేతనంగా ఇస్తున్నారు. అంతకముందు నెలకు రూ.37,100 ఇచ్చేవారు. ఈ సమయంలో మార్చి నెల 10 రోజులు మినహా ఏడాదిలో 11 నెలల 20 రోజులకు జీతాలు అందిం చడంతో బాటు ప్రతి ఏడాదీ కాంట్రాక్టు కొనసాగించేవారు. 2021-22 విద్యా సంవత్సరం నుంచి 10 నెలలకే జీతాలందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ ప్రకారం ఈ నెలాఖరుతో ఒప్పంద అధ్యాపకుల గడువు ముగుస్తుంది. అంటే ఈనెల జీతాలు చెల్లించి తిరిగి వారిని విధుల నుంచి తప్పించి వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభించాక ఉద్యోగాల్లోకి తీసుకుని జీతాలు చెల్లిస్తారు. రాబోయే రెండు నెలలు తరగతులకు హాజరైనా జీతాలు అందే పరిస్థితి లేదు.

విద్యార్థుల ఉత్తీర్ణత ఎలా...?

ఇప్పటికే ఇంటర్ విద్య అధ్యాపకుల కొరతతో తీవ్ర సమస్యలను ఎదుర్కొంటోంది. ఇప్పుడు కాంట్రాక్టు అధ్యాపకుల కాల పరిమితి ముగిస్తే కళాశాలల్లో ఇంటర్ తరగతులు పూర్తి చేయడం ఎలా అన్న ప్రశ్న ఎదురవుతోంది. గతేడాది ఉత్తీర్ణత శాతం పలు కళాశాలల్లో గణనీయంగా తగ్గిపోయింది. ప్రభుత్వ తీరుతో ఈసారి కూడా విద్యార్థుల ఉత్తీర్ణత శాతంపై ప్రభావం పడే అవకాశం ఉంది. పలు కళాశాలల్లో ఈ ఏడాది సిలబస్ పూర్తికాని పరిస్థితుల్లో కాంట్రాక్ట్ అధ్యాపకులు వచ్చే నెల నుంచి క్లాసులు బోధించేందుకు విధులకు దూరమవుతారు. ఈ నేపథ్యంలో ఇంటర్‌లో మెరుగైన ఫలితాలు ఎలా సాధిస్తారని తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్ట్ అధ్యాపకులను కొనసాగించేందుకు ప్రభుత్వం వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

రెగ్యులర్ హామీ వెంటనే నెరవేర్చాలి

కాంట్రాక్టు లెక్చరర్లని ప్రభుత్వం రెగ్యులర్ చేసి ఇచ్చిన హామీ వెంటనే నెరవేర్చాలి. 12 నెలల రెన్యువల్ ఇచ్చి పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రభుత్వ కాలేజీ విద్యార్థుల చదువుకు ఆటంకం లేకుండా చూడాలి.

- ఎం. సత్యన్నారాయణ, ఒకేషనల్ కాంట్రాక్టు లెక్చరర్, కొత్త పేట జూనియర్ కాలేజీ.

12 నెలలు రెన్యువల్ చేయాలి

జూనియర్ కాలేజీ కాంట్రాక్టు లెక్చరర్లకు 12 నెలలు రెన్యువల్ ఇవ్వాలి. నూటికి 90 శాతం కాలేజీలు కాంట్రాక్టు లెక్చరర్స్ మీదే ఆధారపడి పని చేస్తున్నాయి. ఫిబ్రవరి, మార్చి ఈ రెండు నెలలు విద్యార్థులకు ప్రాక్టికల్స్, థియరీ పరీక్షలు జరిగే కీలక సమయం. కావున ప్రభుత్వం ఆలోచించి త్వరగా 12 నెలల రెన్యువల్ ఇవ్వాలి.

- గొర్ల మాణిక్యం, ఉమ్మడి జిల్లా కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు.

గిరిజనుల భూములకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి-కాకినాడ

గిరిజనుల భూములకు రక్షణ కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.రాజశేఖర్ విజ్ఞప్తి చేశారు. శంఖవరం మండలం వేళంగి, దారమల్లాపురం గ్రామాల్లో వేట్ల నూకయ్య డి.పట్టా భూమిని తప్పుడు రికార్డుతో అమ్మి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని శుక్రవారం ఎస్‌సి, ఎస్‌టి స్పందన కార్యక్రమంలో బాధితురాలు భూసారి పార్వతితో కలిసి ఆయన ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి తప్పుడు పత్రాలు సష్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్వతి గత నెలలో స్పందనలో ఫిర్యాదు చేసినా ఏ విధమైన విచారణ చేపట్టకుండానే సమస్య పరిష్కారం అయిందని మెసేజ్ పంపారన్నారు. సమస్యలు పరిష్కార తీరు ఇలా ఉందని విమర్శించారు. జిల్లాలోని సబ్ ప్లాన్ గిరిజనులు తీవ్రంగా నష్టపోతున్నారని, డి.పట్టా భూములు కొనుగోలు చెల్లవని చట్టం చెపుతున్నప్పటికీ రిజిస్ట్రేషన్ ఎలా చేస్తున్నారని ప్రశ్నించారు. సబ్ ప్లాన్ ఏరియాలోని అన్ని గిరిజన గ్రామాలనూ ఐటిడిఎ పరిధిలోనికి తీసుకువచ్చి వారికి రక్షణ కల్పించాలని, వారి భూమి అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు.


ఫిర్యాదు చేస్తున్న రాజశేఖర్, పార్వతి

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు ప్రణాళిక

ప్రజాశక్తి-కాకినాడ

పారిశ్రామిక యూనిట్లలో ప్రమాదాల నివారణకు ప్రామాణిక భద్రతా చర్యలను, ప్రణాళికలను పటిష్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అధికారులు, పరిశ్రమల ప్రతినిధులను కోరారు. శుక్రవారం డిస్ట్రిక్ట్ క్రైసిస్ గ్రూప్ ప్రత్యేక సమావేశం కలెక్టర్ అధ్యక్షతన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఈ సమావేశంలో పారిశ్రామిక విపత్తుల నివారణ గ్రూప్ సభ్యులైన వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రమాదాలకు ఆస్కారం ఉన్న అన్ని పరిశ్రమల్లో విపత్తుల నివారణ, నియంత్రణకు నిరంతర సంసిద్ధత, అప్రమత్తత ఖచ్చితంగా పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా అమ్మోనియా, క్లోరిన్ వంటి కెమికల్స్, ఎల్‌పిజి, బ్యూటేన్ వంటి మండే స్వభావం కలిగిన వాయువులు పెద్ద పరిమాణంలో వాడే పరిశ్రమలు ప్రమాద రహితంగా నిర్వహించేలా పటిష్టమైన భద్రతా జాగ్రత్తలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. జాతీయ, రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థల నిర్దేశాలు కనుగుణంగా విపత్తులను సమర్థవంతంగా నివారించడానికి, నియంత్రించేందుకు సంసిద్ధత పరిశీలనకు ఏటా మాక్ డ్రిల్ నిర్వహించాల్సి ఉందన్నారు. జిల్లాలో ఈ కార్యక్రమాన్ని వచ్చే ఫిబ్రవరి 23న కాకినాడ తీరంలోని కోరమాండల్ సంస్థలో నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. దీనికి ముందు నిపుణుల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 14న భాగస్వామ్య శాఖలు, పారిశ్రామిక సంస్థలకు ఓరియెంటేషన్ సదస్సు, 21న టేబుల్ టాప్ ఎక్సర్‌సైజ్ కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖలు, పారిశ్రామిక సంస్థల విపత్తుల నివారణ, నియంత్రణలో నిర్వహించాల్సిన పాత్ర, బాధ్యతలను రాధాకృష్ణ సభ్యులకు వివరించారు. ఈ సమావేశంలో పరిశ్రమలు, రెవెన్యూ, పోలీస్, ఫైర్, మెడికల్, పర్యావరణ, రవాణా అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు, కార్మిక ప్రతినిధులు పాల్గొన్నారు.

పద్మశ్రీ గ్రహీత చంద్రశేఖర్‌కు సన్మానం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

పద్మశ్రీ అవార్డుకు ఎంపికైన డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్‌ను రాయుడుపాలెంలోని కిరణ్ కంటి ఆసుపత్రి ఆవరణలో పలువురు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. అలయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ పీసుపాటి వినయ్ వర్ధన్ మాట్లాడుతూ సమాజంలో నిరుపేదలు, అణగారిన వర్గాల వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచాలనే ఉద్దేశంతో దేశంలో స్వచ్ఛంద సంస్థ కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప వ్యక్తిని గౌరవించడం తమ క్లబ్‌కు గొప్ప అవకాశమని అన్నారు. ముఖ్య అతిథి జిల్లా గవర్నర్ కొవ్వూరి మునిరెడ్డి మాట్లాడుతూ పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ చందర్ శేఖర్‌ను సన్మానించడం శరవణ్ క్లబ్‌కు గొప్ప అవకాశమని, అవసరమైన వ్యక్తికి సహాయం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. అవార్డు గ్రహీత డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రయోజనాలను ఆశించకుండా ప్రజలకు సేవ చేసేందుకు ముందుకు రావాలన్నారు. ఏమీ ఆశించకుండా ప్రజలకు సేవ చేస్తే దానంతట అదే గుర్తింపు వస్తుందన్నారు. ఆలస్యమైనా కష్టానికి తగిన ఫలితం దక్కుతుందని చెప్పారు. క్లబ్ వ్యవస్థాపకులు దిలీప్ కుమార్ సాధనాని, సి.వెంకటేశ్వరరావు, సిహెచ్.కుటుంబరావు, యల్లా రత్నారావు, దొడ్డి వీరేంద్ర, డి.శ్రీనివాస్, కేదారశెట్టి శ్రీదేవి, ఎస్.రామకృష్ణ పాల్గొన్నారు.

దళితుల శ్మశానాల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-కాకినాడ

జిల్లాలో అనేక గ్రామాల్లో దళితుల శ్మశాన భూముల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం నిర్వహించిన ఎస్‌సి, ఎస్‌టి స్పందనలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దళితపేటలో దళితులు చనిపోతే పూడ్చి పెట్టడానికి శ్మశానాలు లేక కాలువగట్లపైన, ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లు వెళ్లే పుంత రోడ్లపై పూడ్చి పెట్టేవారని ఆనాడు కెవిపిఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తే కోనేరు రంగారావు కమిషన్ వేశారని చెప్పారు. ఆ కమిషన్ నివేదిక ఇచ్చినా నేటికీ సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాళ్లరేవు, కాజులూరు, కరప, పిఠాపురం మండలాల్లో దళిత గ్రామాల్లో శ్మశానాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం దళిత పేటలో శ్మశానాలు లేని గ్రామాలను గుర్తించి 45 రోజుల్లో అర ఎకరం నుండి ఒక ఎకరా భూమి కొనుగోలు చేసి ఇవ్వాలని జిఒ జారీ చేసిందన్నారు. కానీ ఎక్కడా అమలు కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి నాయకులు తుమ్మల నూకరాజు, కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ కె.సింహాచలం, కెఎస్.శ్రీనివాస్, ఎం.రాజశేఖర్, జి.సత్యానందం పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న కెవిపిఎస్ నాయకులు

అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించాలి

ప్రజాశక్తి-కాకినాడ

జిల్లాలో ప్రస్తుతం వ్యవసాయ పనుల్లేక, ఉపాధి పనులు చెప్పక కూలీలు ఇబ్బంది పడుతున్నారని, వారికి వెంటనే పనులు కల్పించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం సంఘం జిల్లా కమిటీ సమావేశం టేకుమూడి ఈశ్వరరావు అధ్యక్షతన స్థానిక సుందరయ్య భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కెఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని, కేంద్రం విడుదల చేస్తున్న అరకొర నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇతర పథకాలకు మళ్లిస్తోందని, దీంతో కూలీలు నష్టపోతున్నారని విమర్శించారు. 2022-23లో కాకినాడ జిల్లాలో పూర్తి స్థాయిలో పనులు కల్పించలేదని ఈ రెండు నెలల్లో అయినా పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం సమస్యలపై ఏప్రిల్ 5న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమంలో వేలాదిగా కూలీలు పాల్గొనాలని సమావేశం పిలుపునిచ్చింది. ఈ సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.సింహాచలం, జిల్లా కమిటీ సభ్యులు దుప్పి అదృష్ట దీపుడు, రుద్రవరపు భూలోకం, చోడిశెట్టి కృష్ణ, చొల్లంగి వెంకట లక్ష్మి, తనుకురాజు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కెఎస్ శ్రీనివాస్

సత్యదేవుని ఆదాయం రూ.1.22 కోట్లు

అన్నవరం : అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామి హుండీల లెక్కింపు ద్వారా రూ.1,27,27,870 ఆదాయం లభించింది. శుక్రవారం కొండపైన దేవస్థానం ఇఒ, చైర్మన్ ఐవి.రోహిత్ సమక్షంలో అధికారులు నెల రోజుల పాటు వచ్చిన ఆదాయాన్ని లెక్కించారు.

ఏలేశ్వరం ఎస్ఐగా సతీష్

ఏలేశ్వరం : ఏలేశ్వరం ఎస్ఐగా జి.సతీష్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. తునిలో పని చేస్తున్న సతీష్ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు ప్రజలు సిబ్బంది సహకారంతో తన బాధ్యతలను నిర్వహిస్తానన్నరు.

నేడు మున్సిపల్ బడ్జెట్ సమావేశం

పెద్దాపురం : పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ బడ్జెట్ సమావేశం శనివారంఉదయం 11:30 గంటలకు కౌన్సిల్ హాల్లో చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర తెలిపారు. అనంతరం 14 అంశాల ఎజెండాపై సాధారణ సమావేశం జరుగుతుందన్నారు.

జమున మృతికి పలువురి సంతాపం

సామర్లకోట రూరల్, పెద్దాపురం : సినీ నటి జమున మృతికి పలువురు సంతాపం తెలిపారు. మాధవపట్నంలో తోలుబొమ్మలాట కళాకారుల కుటుంబాలతో జమునకు ఎంతో అనుబంధం ఉంది. ఆమె 1982లో అప్పటి ముఖ్యమంత్రి టి.అంజయ్య ద్వారా 176 మందికి ఇళ్ల పట్టాలు ఇప్పించారని గుర్తు చేసుకున్నారు. పెద్దాపురంలో ప్రజానాట్యమండలి జిల్లా కన్వీనర్ కేదారి నాగు, మంతెన సత్తిబాబు, దారపురెడ్డి కృష్ణ, సీనియర్ కళాకారులు దారపురెడ్డి సత్యనారాయణ, మహాపాతిన రాంబాబు, సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ జోస్యుల కృష్ణబాబు, కార్యదర్శి కొత్త శివ, వంగలపూడి శివకృష్ణ, చల్లా విశ్వనాథం, పూడి శ్రీనివాస్, జయశ్రీ, మంజుల సంతాపం తెలిపారు.

నాటక రంగం సజీవంగానే ఉంటుంది

ప్రజాశక్తి - పెద్దాపురం

నాటక రంగం ప్రజల మధ్య, ప్రజల ఆదరణతో ఎల్లప్పుడు సజీవంగానే ఉంటుందని నాటిక పరిషత్తు న్యాయ నిర్ణేతలు కె.శాంతారావు, డాక్టర్ ప్రసాద్, గోగులపాటి రాంబాబు అన్నారు. చంద్రమాంపల్లి (దివిలి)గ్రామంలో స్నేహ ఆర్ట్స్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించిన ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఎంపిక చేసిన నాటికల పోటీ ముగింపు బహుమతి ప్రధానోత్సవ సభలో శుక్రవారం వారు ప్రసంగించారు. గొందేసి రాజా అధ్యక్షతన జరిగిన ఈ సభలో వారు ప్రసంగిస్తూ ఈ పరిషత్తులో ప్రదర్శించిన 7 నాటికలు అత్యద్భుతంగా ప్రదర్శించారన్నారు. తెలుగు నాటక రంగ చరిత్రలో పరిషత్తు పోటీలు నిర్వహిస్తున్న ఈ సంస్థ, ఈ ఊరు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. పోటీలను తిలకించేందుకు వచ్చే జనం, ఆదరించే ప్రజలు, చేయూతనిచ్చే అభిమానులు, దాతలు ఉన్నంతవరకు నాటక రంగం ప్రజల మధ్య సజీవంగా కొనసాగుతుందన్నారు. సభానంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సభలో సంస్థ గౌరవాధ్యక్షులు గోగులపాటి సీతారామ స్వామి, కార్యదర్శి ఇంధన బ్రహ్మానందం, దేవాడ పాపేశ్వరరావు, మంతెన సత్తిబాబు, మానేపల్లి రవీంద్ర, కేదారి నాగేశ్వరరావు, గుండేసి సత్యానందం, వెన్నా సత్యనారాయణ(పండు) నూకల మంతి నానాజీ, పాలాని సత్తిబాబు, కురుమళ్ల శ్రీనివాస్, కర్రి స్వామి, మాగాపు నాగేశ్వరరావు, కంటి బోయిన ప్రసాద్, జ్యోతుల దొరబాబు, సమ్మెట గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ నాటికగా ' రెండు నిశ్శబ్దాల మధ్య'

గుంటూరుకు చెందిన అభినయ ఆర్ట్స్ వారు ప్రదర్శించిన 'రెండు నిశ్శబ్దాల మధ్య' నాటిక ఉత్తమ ప్రదర్శనగా ఎంపికయ్యింది. ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా కొలకలూరి శ్రీ సాయి ఆర్ట్స్ వారి 'గమ్యస్థానాల వైపు', చిలకలూరిపేట అంజనా రాథోడ్ క్రియేషన్స్ వారి 'నాన్నా నేనొచ్చేస్తా' తతీయ ఉత్తమ ప్రదర్శనగా ఎంపికయ్యాయి. ఉత్తమ నటుడుగా విజయ్ కుమార్, ఉత్తమ నటిగా అమత వర్షిణి, ఉత్తమ సంగీత కళాకారునిగా లీలామోహన్, ఉత్తమ ఆహార్య కళాకారునిగా థామస్ ఎంపికయ్యారు. విజేతలందరికీ ముగింపు సభలో బహుమతులు అందజేశారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న సభ్యులు

నగరంలో ఎంఎల్ఎ ద్వారంపూడి పర్యటన

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

నగరంలోని 7, 8 డివిజన్ల పరిధిలో సిటీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. మూడున్నరేళ్ళ పాలనలో ప్రభుత్వం అందించిన నవరత్న పథకాలను ప్రజలకు వివరించారు. కుడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తికుమార్, వైసిపి నగరాధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్నసాగర్, కమిషనర్ కె.రమేష్. అదనపు కమిషనర్ సిహెచ్. నాగనరసింహారావు పలువురు అధికారులు, మాజీ కార్పొరేటర్లు ఆయన వెంట ఉన్నారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఎంఎల్ఎ దృష్టికి తీసుకురాగా వాటిని సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్లు పసుపులేటి వెంకటలక్ష్మి, మీసాల ఉదయ్ కుమార్, చిట్నీడి మూర్తి, సంగాని నందం, రోకళ్ల సత్యనారాయణ, శిగల మధు, స్థానిక నాయకులు తొంపల తాతారావు, బత్తిన రాజు, నందకుమార్ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



లోకేష్ పాదయాత్రకు సంఘీభావం

టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన 400 రోజులు, 4 వేల కిలోమీటర్ల యువగళం పాదయాత్రకు శుక్రవారం పలువురు సంఘీభావం తెలిపారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు అభిమానులు, కార్యకర్తల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. తెలుగు యువత పార్లమెంటరీ అధ్యక్షుడు యనముల శివరామకృష్ణ యాత్రను ప్రారంభించారు. కొండబాబు కుమారులు మహీంద్ర వర్మ, హేమంత్ వర్మ కార్యకర్తలతో కలిసి ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, మాజీ కార్పొరేటర్లు తుమ్మల సునీత రమేష్, వమ్మి బాలాజీ, నాయకులు చింతలపూడి రవి, అంబటి చిన్న, జగన్, తదితులున్నారు. **సామర్లకోట రూరల్** లోకేష్ పాదయాత్రకు పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప సంఘీభావం తెలిపారు. శుక్రవారం కుప్పంలోని వరదరాజులు ఆలయంలో నిర్వహించిన పూజల్లో ఎంఎల్ఎ చినరాజప్ప నారా లోకేష్, హిందూపురం ఎంఎల్ఎ సినీ నటుడు నందమూరి బాలకృష్ణలను కలసి యాత్రకు మద్దతును ప్రకటించారు. **పెద్దాపురం** లోకేష్ పాదయాత్ర జయప్రదం అవ్వాలని స్థానిక మరిడమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, టిడిపి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రంది సత్యనారాయణ, తూతిక రాజు, కాకినాడ రామారావు, రేపూరి రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కాకినాడలో టిడిపి యాత్ర


లోకేష్‌ను కలిసిన చినరాజప్ప

కార్పొరేట్‌కు దీటుగా సర్కారు విద్య

ప్రజాశక్తి-యంత్రాంగం

గండేపల్లి కార్పొరేట్ సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్య అందించడమే ప్రభుత్వం లక్ష్యమని జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని మల్లేపల్లి పాఠశాలలో పదో తరగతి విద్యార్థిలకు ఆయన స్టడీ మెటీరియల్ అందజేశారు. అనంతరం మాట్లాడుతూ మండలంలోని మొత్తం 6 స్కూల్స్‌కు సంబంధించి 463 మందికి స్టడీ మెటీరియల్ అందించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి పరిమి వెంకటలక్ష్మి మంగతాయారు బాబు, ఎంపిపి చలగళ్ల దొరబాబు, గ్రామ సర్పంచ్ బల్రెడ్డి గంగరాజు, దొమ్మ శ్రీను, బిట్ర గిరిబాబు, జాస్తి వసంత్, ఎంఇఒ కెహెచ్.నాయక్ పాల్గొన్నారు. **కరపలో** జెడ్‌పిటిసి యాళ్ల సుబ్బారావు విద్యార్థులకు స్టడీ పంపిణీ చేశారు. కరప, అరట్లకట్ట, వేములవాడ, నడకుదురులో ఎంఇఒ బి.కృష్ణవేణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మెటీరియల్ పంపిణీ చేశారు. ఎంపిపి శ్రీలక్ష్మి, ఎంపిడిఒ కె.స్వప్న పేరెంట్ కమిటీ చైర్మన్ ఎస్.రమాదేవి, హెచ్ఎం లీల పాల్గొన్నారు. **తాళ్లరేవు** మండలంలోని పలు హైస్కూల్‌క చెందిన విద్యార్థులు 292 మంది విద్యార్థులకు విద్యా భారతి స్టడీ మెటీరియల్‌ను ఎంపిపి రాయుడు సునీత, జెడ్‌పిటిసి దొమ్మేటి సాగర్ అందజేశారు. విద్యార్థుల సౌలభ్యం కోసం జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో రూపొందించిన మెటీరియల్ పుస్తకాలను అందించారు. శుక్రవారం ఇంజరం, పిల్లంక, నీలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో రాయుడు గంగాధర్, ఇంజరంలో 141 మందికి, నీలపల్లిలో 97 మందికి, పిల్లంకలో 54 మందికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ చింతా మోహన కృష్ణ, ఎంఇఒ ఎ.మంగాయమ్మ, సర్పంచులు ముద్దన వెంకట శివరాం ప్రసాద్, చిట్టూరి నాగమణి, హెచ్ఎంలు కరుణ, రాజరాజేశ్వరి పాల్గొన్నారు.


తాళ్లరేవులో స్టడీ మెటీరియల్ పంపిణీ


భోజనాలను వడ్డిస్తున్న ఆర్‌డిఒ సీతారామారావు

వికలాంగుల సేవ సామాజిక బాధ్యత

ప్రజాశక్తి - పెద్దాపురం

వికలాంగులకు సేవలందించడం సామాజిక బాధ్యతగా గుర్తించాలని ఆర్‌డిఒ జె.సీతారామారావు అన్నారు. మండలంలోని పులిమేరులో శాంతి వర్ధన వికలాంగుల పాఠశాలలో తన తండ్రి తిరుపతయ్య వర్ధంతి సందర్భంగా ఆర్‌డిఒ భోజనాలు ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న వికలాంగులకు విశేష సేవలందిస్తున్న నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రాయవరపు వీరబాబు, ప్రిన్సిపల్ ఆర్.సత్య, ఎఒ వేణు, బాబి, అప్పలరాజు, శివ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే వేగవంతానికి ఆదేశం

ప్రజాశక్తి-కాజులూరు

జగనన్న శాశ్వత భూ హక్కు రక్ష పథకంలో భాగంగా నిర్వహిస్తున్న రీ సర్వేను వేగవంతం చేయాలని కాకినాడ ఆర్‌డిఒ బివి.రమణ కోరారు. శుక్రవారం జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష సర్వేకి సంబంధించి పల్లెపాలెంలో జరుగుతున్న రీసర్వే తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ రమణ మాట్లాడుతూ మండలంలో 19 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే జరుగుతున్నందున సదరు సర్వే వేగవంతం చేయాలని దీనికి సంబంధించి భూములు కచ్చితత్వం విలువ రికార్డులు పారదర్శకంగా రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం కాకినాడ రెవిన్యూ డివిజన్‌లో 121 గ్రామాల్లో రీ సర్వే పూర్తయిన గ్రామాలలో భూ హక్కు పత్రాల పంపిణీకి చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. రెవిన్యూ డివిజన్లో ఇప్పటివరకు 55 వేల 890 భూ హక్కు పత్రాల పంపిణీ చేసినట్టు చెప్పారు. ఈ పర్యటనలో ఆయన వెంట తహశీల్దారు సాయి సత్యనారాయణ, ఆర్‌ఐ వేగేశ్వరరావు గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

తమ కుటుంబాలకు చెందిన పెద్దల వల్ల తమకు ప్రాణహాని ఉందని శుక్రవారం ఒక ప్రేమ జంట కాకినాడ రూరల్ మండలం సర్పవరం పోలీసులను ఆశ్రయించింది. రూరల్ మండలం సర్పవరం గ్రామానికి చెందిన భవాని శంకర్, రామేశ్వరానికి చెందిన అంబికా దేవి కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఇరు కుటుంబాలకు చెందిన పెద్దలు అంగీకరించకపోవడంతో వారు అన్నవరంలో పెళ్లి చేసుకున్నారు. దీంతో అమ్మాయి తల్లిదండ్రుల నుండి ఇద్దరికీ ప్రాణహాని ఉందని శుక్రవారం భవాని శంకర్ అంబికా దేవిలు పోలీసులను ఆశ్రయించారు. ఈ విషయంపై ఇద్దరి కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ చేస్తామని సర్పవరం పోలీసులు తెలిపారు.

లంపీ స్కిన్ నివారణకు జైన్ల సంఘం సాయం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

లంపీస్కిన్ వ్యాధి బారిన పడిన పశువుల రక్షణకు జైన్ల సంఘం (మార్వాడీలు) ముందుకు వచ్చింది. వ్యాధిని అదుపు చేసేందుకు వైద్యంకోసం అవసరమయ్యే మందుల కొనుగోలు కోసం కాకినాడ లోని జైన్ సంఘ ప్రతినిధులు రూ.20 వేల విలువైన మందులను సమకూర్చారు. ఆ మందులను కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సిహెచ్.నాగనరసింహారావుకు గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎడిసి నాగ నరసింహారావ మాట్లాడుతూ మాట్లాడుతూ ఇటీవలి కాలంలో లంపీ స్కిన్ వ్యాధి బారిన పడి పశువులు అల్లాడుతున్నాయని, కొన్ని మరణించాయని చెప్పారు. జైన్ సంఘాల ప్రతినిధులు ముందుకు వచ్చి మందులు అందజేయడం ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, ఎంహెచ్ఒ డాక్టర్ పధీచరణ్, జైన్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎడిసన్‌కు ఘన నివాళి


ప్రజాశక్తి-పెద్దాపురం


పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

పెద్దాపురం ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో ఎలక్ట్రీషియన్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను సంఘ అధ్యక్షులు తాడిశెట్టి గంగ ఆవిష్కరించారు. కేకు కట్ చేసిన అనంతరం సంఘం గౌరవాధ్యక్షుడు చింతల సత్యనారాయణ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సభలో సత్యనారాయణ మాట్లాడుతూ థామస్ ఆల్వా ఎడిసన్ విద్యుత్తు బల్బుతో పాటు 108 ఆవిష్కరణలు చేశారన్నారు. ఆధునిక సమాజ వికాసంలో ఆయన పాత్ర మరువలేనిదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును నిలిపి వేయడం వల్ల భవన నిర్మాణ రంగంలోని వివిధ విభాగాల్లో పని చేస్తున్న వేలాదిమంది కార్మికులు సంక్షేమ ఫలాలను కోల్పోతున్నారన్నారు. సంక్షేమ బోర్డు పునరుద్ధరణకు కార్మికులందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. సభానంతరం సూర్యారావు భవనం నుండి మున్సిపల్ సెంటర్ వరకు కార్మికులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆర్‌డిఒ జె.సీతారామారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు గడిగట్ల సత్తిబాబు, డి.క్రాంతికుమార్, బుడతా సుధాకర్, నాలం శ్రీనివాస్, ఘంటసాల గణేష్, లంక చంటి, పోతాబత్తుల చినబాబు, భూసారి శ్రీను, కామాడి శ్రీను, బైలపూడి రాంబాబు, కందిరెళ్ల దుర్గాప్రసాద్, షేక్ బాషా, జోకా సూర్యనారాయణ, ఉప్పు మహేశ్వరరావు, వడగాబత్తుల లింగేశ్వరరావు, గుత్తుల శ్రీను పాల్గొన్నారు.

'లంపీ స్కిన్'పై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-గండేపల్లి


సమావేశంలో మాట్లాడుతున్న జెడి

పశువులకు సంక్రమిస్తున్న లంపీ స్కిన్ వ్యాధిపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ జెడి డాక్టర్ సూర్య ప్రకాశరావు తెలిపారు. గండేపల్లిలో వెటర్నరీ హాస్పిటల్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పశువులకు లంపీ స్కిన్ డిసీస్ అనే వ్యాధి దేశవ్యాప్తంగా సోకిందని, ఈ వైరస్ పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో 76,000 పశువులకు 64 వేల ఐదు వందల పశువులకు వ్యాక్సిన్ వేసినట్టు చెప్పారు. ఈ వైరస్ సోకిన వాటిలో 1720 పశువులను గుర్తించినట్లు తెలిపారు. ఈ వైరస్ సోకిన పశువుల గురించి రైతులు పశువైద్య సిబ్బందికి వెంటనే సమాచారం ఇవ్వాలని చెప్పారు. ఇప్పటికే జిల్లాలో 19 లేగదూడలు, నాలుగు పెద్ద పశువులు మృతి చెందాయని చెప్పారు. ఈ పశువుల విషయంలో వెటర్నరీ సిబ్బంది అలసత్వం వహిస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు అసిస్టెంట్ డైరెక్టర్ సత్యనారాయణ, డైరెక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ సోనీ, డాక్టర్ సుప్రియ, డాక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా గృహనిర్మాణాలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమంగా ఉన్న గృహనిర్మాణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రత్యేకాధికారులు ప్రణాళికతో ముందుకు వెళ్లాలని నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ ఆదేశించారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో జరుగుతున్న గృహనిర్మాణాలపై గృహనిర్మాణ అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు, కాంట్రాక్టర్లతో ఎడిసి సిహెచ్.నాగనరసింహారావుతో కలిసి సమీక్షించారు. డివిజన్ల వారీగా గృహనిర్మాణ ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ఎంతమంది అగ్రిమెంట్లు ఇచ్చారు.. ఎన్ని ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయి.. సాంకేతిక పరమైన ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా.. వంటి అంశాలపై ఆయన డివిజన్ల వారీగా సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్లతోపాటు టిడ్కోలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను కూడా మరింత వేగవంతం చేయాలన్నారు. గృహనిర్మాణ లబ్ధిదారులుగా ఉన్న స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.35 వేల బ్యాంకు లింకేజీపై బ్యాంకుల నుంచి అందే సహకారం, ఇతర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని కూడా ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. లక్ష్యాలను నిర్దేశించుకుని ఎట్టిపరిస్థితుల్లోను వాటిని అధిగమించి వేగవంగా ఇళ్ళ నిర్మాణాలు జరిగేలా చూడాలన్నారు. అదనపు కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు మాట్లాడుతూ అగ్రిమెంట్ ఇచ్చిన లబ్ధిదారుల ఇళ్ళను మరింత వేగవంతం చేయడంతోపాటు రెండవ దశ నిర్మాణాలపై దృష్టి పెట్టాలన్నారు. గృహనిర్మాణాలకు ప్రస్తుత వాతావరణం అనుకూలంగా న్నందున ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, గృహనిర్మాణశాఖ డిఇ గుప్తా, మానే కృష్ణమోహన్, పలువురు ప్రత్యేక అధికారులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి స్పందనకు 25 అర్జీలు


ప్రజాశక్తి-కాకినాడ

ఎస్‌సి, ఎస్‌టి ప్రత్యేక స్పందన కార్యక్రమంలో అందిన ప్రతి అర్జీలను నాణ్యతతో సకాలంలో పరిష్కరించే విధంగా వివిధ శాఖల అధికారులు కృషి చేయాలని జిల్లా పరిషత్ సిఇఒ ఎన్.వి.వి.సత్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహించారు. సిఇఒ సత్యనారాయణ, ఎస్‌సి కార్పొరేషన్ ఈడి డిఎస్ సునీత, కెఎస్ఇజెడ్ ఎస్‌డిసి కె.మనోరమ తదితరులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 25 అర్జీలు అందగా వాటి పరిష్కారం నిమిత్తం ఆయా శాఖల అధికారులకు పంపించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, భూమి సమస్యలు, సంక్షేమ పథకాల, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, గహం, పింఛన్ మంజూరు వంటి అంశాలపై అర్జీలు అందాయి. ప్రతి నెలాఖరు శుక్రవారం జిల్లాలోని ఎస్‌సి, ఎస్‌టి ప్రజల సమస్యల పరిష్కార నిమిత్తం ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని ఎస్‌సి, ఎస్‌టి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్‌పి సిఇఒ ఎన్.వి.వి.సత్యనారాయణ తెలిపారు. ఈ ప్రత్యేక స్పందన కార్యక్రమంలో అందిన అర్జీలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి, గడువులోపు పరిష్కరించాలని సూచించారు.

బ్యాంకులు రుణాలిచ్చి సహకరించాలి

ప్రజాశక్తి-కోటనందూరు

ప్రజలకు బ్యాంకులో రుణాలు ఇచ్చే సహకరించాలని ఎంపిపి ఎల్.శ్రీనివాస్ బ్యాంకు సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో పిఎంఇజిపి పథకం ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ రూపంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న చిన్న, కుటీర పరిశ్రమలకు, స్వయం ఉపాధి, కల్పించి మేలు చేయాలనే ప్రభుత్వం లక్ష్యం అన్నారు. ప్రభుత్వ లక్ష్యాలను ప్రజలకు చేరువు చేయడంలో మండలంలో ఉన్న వివిధ బ్యాంకులు నిబంధనలను సాకుగా చూపి రుణాలు ఇవ్వడం లేదన్నారు. బ్యాంకు సిబ్బంది తన పనితీరును మార్చుకుని ప్రజలకు సేవ చేసే విధంగా ఉండాలని కోరారు. 2022 ఏడాదిలో పిఎంఇజిపి పథకం ద్వారా 17 గ్రామ పంచాయతీల్లోనూ ఏ ఒక్కరికి రుణాలు ఇచ్చిన దాఖలాలు లేవని, బ్యాంకు సిబ్బందిని నిలదీశారు. బ్యాంకు సిబ్బందికి ఆయా శాఖ అధికారులు సమన్వయ లోపం వల్ల ప్రజల తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో లంక ప్రసాద్, గర్సింగ్ దొరబాబు, ఎంపిడిఒ ఎస్ఎస్.శర్మ, ఎపిఎం సూర్యకుమారి, పిబి.శ్రీనివాస్, వివి.పద్మ తదితరులు పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ చంటిబాబు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-గండేపల్లి

ప్రజా సమస్యల పరిష్కారానికి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఎంఎల్‌ఎ జ్యోతుల చంటిబాబు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన గండేపల్లిలో ఎంపిపి చలగళ్ల దొరబాబు ఆధ్వర్యంలో ఆయన ప్రతి ఇంటికీ తిరుగుతూ ప్రజాసమస్యలు తెలుసుకుంటున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామంలో డ్రైనేజీలు సక్రమంగా లేకపోవడం వల్ల ఎక్కడ నీరు అక్కడ నిల్ల ఉండడం వలన అనేక రోగాలు బారిన పడుతున్నామని, ఎన్నిసార్లు చెప్పినా అధికారులు కానీ ప్రజా ప్రతినిధులు గాని పట్టించుకోవటం లేదని చెప్పారు. పలు సమస్యలను ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆయన స్పందించి సంబంధిత అధికారులను పిలిచి వెంటనే డ్రైనేజీ వ్యవస్థ సక్రంగా ఉండేటట్లుగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కందుల చిట్టిబాబు, కేతిన బాబి, జాస్తి వసంత్, ఒబిన్ని వీరబాబు, తాళ్లూరి మధు కుమార్, పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు


ఎరువుల దుకాణంలో తనిఖీలుచేస్తున్న సిబ్బంది

ఆరు మెట్రిక్ టన్నుల ఎరువుల సీజ్

ప్రజాశక్తి-అమలాపురం

విజిలెన్స్ అధికారులు, వ్యవసాయ శాఖ, లీగల్ మెట్రాలజి అధికారులతో కలిసి రావులపాలెం మండలం ఈతకోట గ్రామంలోని వెంకటేశ్వర ఫెర్టిలైజర్స్ దుకాణాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. స్టాక్ నిల్వలలో వ్యత్యాసాలపై రావులపాలెం మండల వ్యవసాయ అధికారి షాపు యజమానిపై 6ఎ క్రింద కేసు నమోదు చేశారు. దుకాణంల రూ.69,015 విలువ గల సుమారు 6.315 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేశారు. ఆ షాపుల నందు క్రిబ్కో యూరియా గరిష్ఠ అమ్మకపు ధర రూ.266.50 వుండగా రూ.300లకు విక్రయిస్తున్నారని గుర్తించిన లీగల్ మెట్రాలజి అధి,కారులు కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో కార్యాలయ ఇన్‌స్పెక్టర్ సత్యకిషోర్, తహశీల్దార్ విజయకుమార్ పాల్గొన్నారు.

ఇద్దరు మద్యం విక్రేతల అరెస్ట్

ప్రజాశక్తి-సామర్లకోట

పట్టణంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. వారినుంచి 50 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు సామర్లకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో స్థానిక మఠం సెంటర్ లోని ఎన్.నరసింహమూర్తి ఐరన్ షాపులోనూ, జి.సత్యనారాయణ నివాసంలోనూ మద్యం నిల్వ ఉంచి అమ్ముతున్నట్టు సమాచారం రావడంతో పోలీసులు ఆకస్మికంగా దాడి చేసి వారిని అరెస్టు చేశారు. వారినుంచి మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి ఎక్సైజ్ కోర్టుకు తరలించారు. కేసును స్థానిక సిఐ కె.దుర్గా ప్రసాద్ దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కల దాడిలో 8 మందికి గాయాలు

ప్రజాశక్తి-సామర్లకోట

స్థానిక 26వ వార్డు అయోధ్యరామపురంలో కుక్కల దాడిలో ఎనిమిది మంది గాయపడ్డారు. వార్డులోని పెనుపోతుల తారాపాలిన్స్ దుకాణానికి వెళ్లే రోడ్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఆ దారిలో వెళ్లే వారిపై దాడి చేసిగాయపరుస్తున్నాయి. పలువురు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ గత మూడు రోజుల్లో 8 మందిపై కుక్కలు దాడి చేసి గాయపరిచాయన్నారు. ఆసుపత్రుల చుట్టూ ఇంజక్షన్ల కోసం తిరుగుతున్నారని బాధితులు వాపోయారు. మున్సిపల్ అధికారులు కుక్కల నివారణకు చర్యలు చేపట్టాలని వార్డు నాయకులు నక్కా జానకి రామయ్య తదితరులు కోరారు.

జి వేమవరంలో ఫిల్టర్ బెడ్స్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి-ఐ.పోలవరం

జి.వేమవరం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న తాగునీటి ప్రాజెక్టు వద్ద ఒఎన్‌జిసి ద్వారా రూ. 2.26 కోట్ల సిఎస్‌ఆర్ నిధులతో ర్యాపిడ్ శాండ్ ఫిల్టర్ బెడ్స్ నిర్మాణ కోసం శుక్రవారం ముమ్మిడివరం ఎమ్ఎల్ఏ పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ శంకుస్థాపన చేశారు. ఎంపిపి మో ర్త రాణి మిరియం జ్యోతి, జెడ్ పి టి సి సభ్యులు సమక్షంలో ఈ కార్యక్రమంనిర్వహించారు. ఎమ్ఎల్ఏ పొన్నాడ సతీష్ కుమార్ మాట్లాడుతూ తొమ్మిది గ్రామ పంచాయతీ పరిధిలోని ఉన్న 40వేలు జనాభాకు అదనంగా పదకొండు వాటర్ ట్యాంక్ లు నిర్మాణ పనులు జరుగుతున్నాయని అన్నారు. ఆర్‌ఎస్ఎఫ్ నిర్మాణ పనులు ఆరు నెలలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను కోరామన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు పిన్నమరాజు సత్యనారాయణరాజు, విత్తనాల శ్రీనువాసరావు, దొమ్మేటి దుర్గాప్రసాద్ తదితరులుపాల్గొన్నారు.

'రావిపూడి' సంతాప సభ

ప్రజాశక్తి-ఐ.పోలవరం

ఐ.పోలవరంలో ప్రజ్ఞాసాహితి ఆధ్వర్యంలో శుక్రవారం ఐ పోలవరం శాఖా గ్రంథాలయం వద్ద హేతువాది మాస పత్రిక ఎడిటర్, మానవవాద ఉద్యమ రూపకర్త రావిపూడి వెంకటాద్రి సంతాప సభ శుక్రవారం నిర్వహిం చారు. ఈ నెల 21న రావిపూడి వెంకటాద్రి మరణి ంచారు. ఆయన చిత్రపటానికి పలువురు పూల మాలలు వేసి ఘనంగా నివాళ్లుల్పంచారు. ప్రజ్ఞాసతి వ్యవస్థాపకుడు డాక్టర్ పుల్లేపు వెంకటేశ్వరరావు మాట్లా డారు. కార్యక్రమంలో సిహెచ్. విద్యాసాగర్, పులపకూర శ్రీరామ్, ఎఎస్ఎన్.మూర్తి, కె.మహేష్, కె.శ్రీనివాస్, పి.పాపారావు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనానికి భూమి పూజ

ప్రజాశక్తి-రామచంద్రపురం

రూ.5 లక్షలతో ఒదూరు గ్రామంలో నిర్మించే బాబు జగ్జీవన్ రామ్ కమ్యూనిటీ నూతన భవనానికి మండల అధ్యక్షులు అంబటి భవాని భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దళితుల కోసం అహర్నిశలు పని చేసిన గొప్ప నాయకుడు జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. అటువంటి నాయకుని స్మరించు కావడం గొప్ప విషయం అని అన్నారు. దీనికి మంత్రి వేణు నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బుంగ రాజు, ఎంపిటిసి సభ్యురాలు పరమటి జ్ఞాన లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సినీనటి జమున మృతికి సంతాపం

ప్రజాశక్తి - కడియం

సినీనటి, మాజీ ఎంపీ జమున మృతి పట్ల ఇండియన్ నర్సరీ మెన్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు పల్ల సుబ్రహ్మణ్యం సంతాపం వ్యక్తం చేశారు. ఆమెతో తమ నర్సరీకి ఎంతో అనుబంధం ఉండేదని, మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహన్‌రావు నాయకత్వంలో తమ తండ్రి దివంగత పల్ల వెంకన్న కడియం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా పనిచేసిన సందర్భాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. జమునతో రాజకీయ అనుబంధంతో పాటు ఆత్మీయ నేపథ్యం ఉందని సుబ్రహ్మణ్యం తెలిపారు. జమున మృతిపట్ల సుబ్రహ్మణ్యంతో పాటు పల్ల వెంకన్న ఛారిటబుల్ ఫౌండేషన్ ప్రతినిధులు పల్ల సత్యనారాయణ మూర్తి, గణపతి విచారం వ్యక్తం చేశారు.

లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - కోరుకొండ

స్థానిక అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద శుక్రవారం టిడిపి బిసి నాయకుడు బర్ల బాబూరావు ఆధ్వర్యంలో నారా లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బర్ల మాట్లాడుతూ లోకేష్ పాదయాత్రకు భద్రతాపరమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఆటో కార్మికులకు పండ్లు పంపిణీ చేశారు.


సత్యసాగర్‌కు సాయం అందజేస్తున్న అంబేద్కర్‌యూత్

అంబేద్కర్ యూత్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కొత్తపేట

మండల పరిధిలోని కొత్తపేట శివారు గోగివారి పేటకు చెందిన అంబేద్కర్ యూత్ సభ్యులు సంక్రాంతి సంబరాల్లో ప్రమాదవశాత్తు గాయపడ్డ చికిత్స పొంది ఇంటి వద్ద ఉన్న సత్యసాగర్ కు రూ.20 వేల ఆర్థిక సాయం శుక్రవారం అందజేశారు. త్వరలోనే సత్యసాగర్ కోలుకోవాలని వారు కోరారు.


రక్తదానం చేస్తున్న విద్యార్థి

కళాశాల్లో రక్తదానం శిబిరం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

అమలాపురం పట్టణం స్థానిక శ్రీవెంకటేశ్వరా డిగ్రీ కళాశాల్లో రక్తదానం శిబిరం ఏర్పాటుచేవారు. ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు కలిసి అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి శుక్రవారం రక్తదానం చేశారు. వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారి కోసం విద్యార్థులు, అధ్యాపకులు స్వచ్ఛందంగా రక్తదానం చేసారు. కార్యక్రమంలో సెక్రటరీ, కరస్పాండెంట్ కె.నరసింహరావు, ప్రిన్సిపల్ కె.మనోహర్, ఆంధ్రా సేవారత్న కరాటం ప్రవీణ్, కరాటం సత్యశ్రీ, కె.శ్రావణ్ దిలీప్, యాలంగి వరప్రసాద్, బి.శ్రీనివాస్, గుర్రం దర్మరాజు, గుర్రం మహేష్, సంసోన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల మార్పు

ప్రజాశక్తి - తాళ్లపూడి

ప్రక్కిలంక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ప్రమాద భరితంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్తవి వేస్తున్నామని ఎలక్ట్రికల్ ఎఇ సిహెచ్.వెంకట్రావు తెలిపారు. మండల పరిధిలో ఎల్‌టి స్తంభాలు సుమారు 80 వరకు 11 కెవి పరిధిలో 40 స్తంభాలు ప్రమాద భరితంగా ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఉన్నతాధికారుల అనుమతితో వీటిని తొలగించి కొత్తవి ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

మంచి నీటి ఎద్దడి లేకుండా చర్యలు

ప్రజాశక్తి-అమలాపురం

సి ఎస్ ఆర్ ఫండ్స్ ద్వారా చమురు సంస్థలు అమలాపురం డివిజన్ లో మంచి నీటి ఏద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని మంత్రి విశ్వరూప్ అన్నారు. చమురు సంస్థల ప్రతినిధులు తాగు నీరు కొసం రూ.5 కోట్లు కేటాయింపునకు సూత్రప్రాయంగా అంగీకరించారు. అమలాపురం ఆర్‌డిఒ సంత రాయుడు అధ్యక్షునిగా జరిగిన సమావేశంలో అమలాపురం ఎంపీ చింతా అనురాధ మాట్లాడుతూ యానాం ఇతర గ్రామాల్లో 2.16 కోట్లతో నిధులు విడుదల చేయడం సంతోషమని అన్నారు.

'తప్పుడు ప్రచారాలతో ఎన్నాళ్లు మోసం చేస్తారు'

ప్రజాశక్తి- బిక్కవోలు

'మీ చేతకాని తనాన్ని కప్పిపుచ్చుకోవడం కోసం తప్పుడు ప్రచారాలతో ప్రజలను ఎన్నాళ్లు మోసం చేస్తారు' అని మాజీ ఎంఎల్‌ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అనపర్తి ఎంఎల్‌ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని ప్రశ్నించారు. శుక్రవారం ఆయన నివాశంలో విలేకర్లతో మాట్లాడారు. ఇళ్ల పట్టాలు ఇవ్వకూడదంటూ రామకృష్ణారెడ్డి కోర్టుకి వెళ్లాడనే తప్పుడు ప్రచారం ఇంకెంతకాలం చేసాన్నారు. కాపవరం భూముల్లో మీరు చేసిన అవినీతిని అరికట్టాలని మాత్రమే తాను కోర్టుకు వెళ్లాలని స్పష్టం చేశారు. అవినీతి జరిగిందని కోర్టు ధ్రువీకరించిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఆళ్లపట్టాలు ఆపాలంటూ కోర్టుకు వెళ్లినట్టు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా లేకపోతే మీరు ఎంఎల్‌ఎ పదవికి రాజీనామా చేస్తారా?అని సవాల్ విసిరారు.


బహుమతిని అందుకుంటున్న కార్టూనిస్ట్ శేఖర్

శేఖర్ కార్టూన్‌కి ప్రత్యేక జ్యూరీ బహుమతి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

హాస్యపత్రిక హాస్యానందం సౌజన్యంతో నిర్వహించిన శ్రీమతి గుళ్లపల్లి అరుణకుమారి స్మారక రాష్ట్ర స్థాయి కార్టూన్ పోటీల్లో రాజమహేంద్రవరానికి చెందిన సీనియర్ కార్టూనిస్ట్ శేఖర్‌కు ప్రత్యేక జ్యూరీ బహుమతి లభించింది. అవార్డుతో పాటు నగదు, ప్రశంసా పత్రాన్ని విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో అందుకున్నట్టు శేఖర్ తెలిపారు. హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ వై.వెంకటరవిప్రసాద్, హాస్యానందం పత్రిక సంపాదకులు పి.రాము, నిర్వాహకులు పద్మదాస్, అన్నం బాచి, కప్ప గంతు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. బహుమతులు పొందిన కార్టూన్లతో ఏర్పాటు చేసిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

పేదలకు అన్నదానం అభినందనీయం

ప్రజాశక్తి - గోపాలపురం

ప్రతి శుక్రవారం అన్నా క్యాంటీన్ ద్వారా పేదలకు ఉచితంగా భోజనం పెట్టడం అభినందనీయమని మాజీ ఎంఎల్‌ఎ వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం చెక్ పోస్ట్ సెంటర్ వద్ద టిడిపి మాజీ మండల అధ్యక్షులు మేణి సుధాకర్ ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన భోజనాలను పేదలకు అందజేశారు. ఆయన మాట్లాడారు. టిడిపి హాయంలో రూ.5లకే అన్నా క్యాంటీన్‌ల ద్వారా పేదలకు భోజనం అందించారన్నారు. పేదల ఆకలి తీర్చేందుకు దాతలు ముందుకు రావా లన్నారు. టిడిపి మండల మాజీ అధ్యక్షులు ఎం.సుధాకర్ ఆర్థిక సహకారంతో 300 మందికి భోజనాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

'చైతన్యనగర్‌లో గడప గడపకూ...'

ప్రజాశక్తి - కడియం

మండలంలోని మాధవరాయుడుపాలెం శివారు చైతన్య నగర్‌లో శుక్రవారం వైసిపి రూరల్ కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైసిపి గ్రామ ఇన్‌ఛార్జి సంగీత వెంకటేశ్వర్లు, రానా హరిశ్చంద్ర, శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, వ్యవసాయ మండలి ఛైర్మన్ ఈలి గోపాలం, ఎంపిడిఒ రత్నకుమారి, కడియం మండల బూత్ ఇన్‌ఛార్జ్ తాడాల చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

నాగభవాని ఎంపిక పట్ల హర్షం

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలో ఊనగట్ల జిల్లా పరిషత్ హై స్కూల్‌కి చెందిన విద్యార్థులు గుడాల నాగభవాని జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికవ్వడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. మదనపల్లి అన్నమయ్య జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-17 బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతగా నిలిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందని హెచ్‌ఎం టిఎస్.రామానుజం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్ధిని భవాని, పీడీ పి.లెనిన్‌బాబులను హెచ్‌ఎం, పిఎంసి ఛైర్మన్ మడిపల్లి శ్రీమన్నారాయణ, నందిగామ శ్రీనివాస రావు, సర్పంచ్ మట్టా వెంకట్రావు అభినందించారు.

వాలీబాల్ పోటీల్లో రంజిత్ ప్రతిభ

ప్రజాశక్తి -దేవరపల్లి

ఈనెల 23 నుంచి 25 వరకు కర్నూల్‌లో జరిగిన అండర్-17 ఎస్‌జిఎఫ్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో చిన్నాయగూడెం స్కూల్ విద్యార్థి అంబటి రంజిత్ ప్రతిభ కనబర్చాడు. జాతీయ స్థాయిలో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రంజిత్‌ని హెచ్‌ఎం శ్రీనివాస్, సిబ్బంది, ఊరిపెద్దలు అభినందించారు. రంజిత్ 9వ తరగతి చదువుతున్నాడు. చదువులోనూ ఆటల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నాడని పీడీ ఆచంట వెంకటేశ్వరావు తెలిపారు. రంజిత్ నాన్న అంబటి శ్రీను వ్యవసాయ కూలీగా కుటుంబాన్ని పోషిస్తున్నారు.